## కామ్రేడ్ నల్లాని స్వామీరావుకు విప్లవ జోహార్లు

**సి.పి.ఐ. (ఎం.ఎల్)** నాయకులు, తెలంగాణా రాష్ట్ర కమిటీ సభ్యులు, తెలంగాణా రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామ్రేడ్ నల్లాని స్వామీరావు ది. 24-7-2019న తుదిశ్వాస విడిచారు. 73 సంవత్సరాల ఆయన జీవితంలో 47 సం॥ల జీవితం విప్లవ రాజకీయాల నీడలోనే సాగింది.



కామ్రేడ్ స్వామీరావు కుటుంబం ఆయన చిన్నతనంలోనే కరీంనగర్ జిల్లానుంచి వచ్చి పాత వరంగల్ జిల్లా ములుగు తాలూకా పంచోదుకుల పల్లెలో స్థిరపడ్డారు. ఆ ప్రాంతంలో ఆనాటికి అభివృద్ధి చెందుతున్న ప్రజా ఉద్యమం, మార్క్సిస్టు భావజాలం ఆయనను విప్లవ కమ్యూనిస్టుగా మార్చాయి. 1968-69 కాలం నుండి కామ్రేడ్ స్వామీరావు కామ్రేడ్ రామనర్సయ్య, సామా అంతిరెడ్డి తదితర నాయకుల సాహచర్యంలో ములుగు ప్రాంత పీడిత రైతాంగ, గిరిజన ఉద్యమాలలో మమేకం అయ్యారు. ఎన్నో నిర్బంధాలను తట్టుకొని నిలిచారు. తదనంతర కాలంలో నిర్బంధాల మధ్య నిర్వాహకులలో వచ్చిన చీలికలు, తీవ్ర ఒడుదుడుకుల మధ్యకూడా నిబ్బరంగా నిలబడటం ఆయన విశిష్టత. 2013 తర్వాత విప్లవశక్తుల ఐక్యతా క్రమంలో అత్యంత బాధ్యతగా కృషిచేసారు. కష్టాలు, ఆటుపోట్లతో నిబ్బరంగా నిలిచి శ్రేణులకు ఉత్తేజాన్ని ఇచ్చిన కామ్రేడ్ స్వామిరావు మరణం ప్రజా ఉద్యమాలకు ఒక లోటు. ఆ కామ్రేడ్‌కు ఆంధ్రప్రదేశ్ తెలంగాణా రాష్ట్రాల నాయకత్వం, శ్రేణుల విప్లవ జోహార్లు అర్పిస్తున్నారు.

**సంతాపసభ, అంతిమయాత్ర:**

కామ్రేడ్ స్వామిరావు మరణవార్త విన్నంతనే పార్టీ కార్యకర్తలు, ప్రజలు, విప్లవాభిమానులు ఆయన గ్రామం చేరుకొన్నారు. సి.పి.ఐ.ఎం.ఎల్. తెలంగాణా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ ప్రసాదన్న ఆధ్వర్యంలో సంతాపసభ జరిగింది. కా॥ ప్రసాదన్న స్వామిరావుతో గల 46 సం॥ల అనుబంధాన్ని గుర్తు చేసుకొన్నారు. సి.పి.ఐ.ఎం.ఎల్ కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ గుర్రం విజయకుమార్, తెలంగాణా రాష్ట్ర పార్టీ నాయకులు కామ్రేడ్స్ కిమిడి ఉప్పలయ్య, మోడెం మల్లేష్ తదితరులు, స్త్రీ సంఘటన పత్రిక సంపాదకులు కామ్రేడ్ యం.లక్ష్మి, సి.పి.ఐ. ములుగు జిల్లా కార్యదర్శి బద్యాత్ రాజు, సి.పి.యం. డివిజన్ కార్యదర్శి అమ్జద్, మేడారం జాతర ట్రస్టు చైర్మన్ కా॥ లింగన్న, యు.సి.సి. ఆర్.ఐ (ఎం.ఎల్) కిషన్ వర్గం నుండి కా॥ సదానందం తదితరులు కామ్రేడ్ స్వామిరావు జీవితం రాజకీయాలు గురించి, వారి వారి అనుబంధాలను వివరించారు. కామ్రేడ్ చంద్రపుల్లారెడ్డి, రామనర్సయ్య, అంతిరెడ్డిల విప్లవ స్ఫూర్తితో కామ్రేడ్ స్వామిరావు సాగించిన కృషిని జ్ఞప్తికి తెచ్చుకొన్నారు. ఆ కామ్రేడ్‌కి జోహార్లు చెపుతూ అంతిమయాత్ర నిర్వహించారు.

oooo

## కామ్రేడ్ ఇ. రామన్న గౌడ్‌కి విప్లవ జోహార్లు



**సి.పి.ఐ. ఎం.ఎల్.** సీనియర్ నాయకులు, రైతుకూలీ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ ఇ. రామన్నగౌడ్ కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జూన్ 26వ తేదీన మరణించారు. మరణించే నాటికి ఆయన వయస్సు సుమారు 87సం॥లు. 1950ల. నుండే కమ్యూనిస్టు భావనలను స్వీకరించి కర్నూలు జిల్లాలో అనేక రాజకీయ, ప్రజా ఉద్యమాలలో పాల్గొన్నారు. ఎమ్మిగనూరు ప్రాంతంలో ఎమ్మిగనూరు, ఆయన పుట్టిన స్వగ్రామం. దైవందిన్నె, ఏనుగుబాల, పెదమర్రివీడు, పెసలదిన్నె తదితర గ్రామాలలో సాగిన భూపోరాటాలు, ఇళ్లస్థలాల ఆందోళనలు ఆయన ఆధ్వర్యంలో జరిగినవే. నేటికీ ప్రజలు ఆ విజయాలను కాపాడుకొన్నారు. మరోపక్క కామ్రేడ్ రామన్నగౌడ్ ఆ ప్రాంతంలోని మాతంగి వ్యవస్థ వంటి సాంఘిక దురాచారాలను, కుల వివక్షలుగా వ్యతిరేకించి ఆందోళనలు నిర్వహించారు. కార్మిక నాయకుడుగా ఎమ్మిగనూరు స్పిన్నంగ్ మిల్లు, ఇతర కార్మికుల ఆందోళనలను నడిపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ఐ.ఎఫ్.టి.యు రాష్ట్ర అధ్యక్షుడుగా వ్యవహరించారు. కామ్రేడ్ రామన్నగౌడ్ ఒక రోడ్డు ప్రమాదంలో కాలు విరిగినా, నడవడం పెద్ద సమస్యే అయినా సాధ్యమైనంత వరకూ ప్రయాణాలు సాగించి కృషి చేసారు. వార్ధక్య సమస్యలతో చివరివరకూ నమ్మిన ఆశయం కోసం నిలచి తుదిశ్వాస విడిచారు.

**సంతాపసభ:** కామ్రేడ్ రామన్నగౌడ్ సంతాపసభ 14-7-2019న ఎమ్మిగనూరులో జరిగింది. కామ్రేడ్ సంజీవ్ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో సి.పి.ఐ(ఎం.ఎల్) తెలంగానా రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ ప్రసాదన్న ఆయనతోగల అనుబంధాన్ని గుర్తుచేసుకొన్నారు. రామన్నగౌడ్ విప్లవ కమ్యూనిస్టు రాజకీయాలను స్వీకరించి కా॥ చంద్రపుల్లారెడ్డి, నీలం రామచంద్రయ్యల స్ఫూర్తితో చివరివరకూ

నిలిచారని నివాళులు అర్పించారు. ఏ.ఐ.ఎఫ్.టి.యు(న్యూ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ పెద్దన్న రామన్నగౌడ్‌తో ఆయనకుగల ఎమర్జెన్సీ జైలు జీవితాన్ని గుర్తు చేసుకొంటూ నిర్బంధాల మధ్య నిలచిన తీరును వివరించారు. తెలంగాణా రాష్ట్ర ఏ.ఐ.ఎఫ్.టి.యు అధ్యక్షులు మోడెం మల్లేష్, రైతుకూలీ సంఘం నాయకులు కిమిడి ఉప్పలయ్య, సి.పి.ఐ.ఎం.ఎల్. న్యూ డెమోక్రసీ నాయకులు, మానవహక్కుల వేదిక, పౌరహక్కుల సంఘాల నేతలు, ఇతర పార్టీ నాయకులు కామ్రేడ్ రామన్నగౌడ్‌కి నివాళులు అర్పించారు.

oooo

## కామ్రేడ్ బ్రహ్మానంద మాలిక్‌కు విప్లవజోహార్లు



**సీనియర్** కమ్యూనిస్టు, ఒడిషా సిపిఐ(ఎం.ఎల్) రాష్ట్రకమిటీ సభ్యులు కామ్రేడ్ బ్రహ్మానంద మాలిక్ 4-5-2019న పూరీ జిల్లాలోని గోప్‌లోని తన ఇంటిలో అనారోగ్య కారణాలతో తుదిశ్వాస విడిచారు. ఆయనకు 86 సంవత్సరాలు.

కామ్రేడ్ మాలిక్ పేదరైతాంగ కుటుంబానికి చెందినవారు. 1951లో ఆయన కమ్యూనిస్టు పార్టీలో చేరారు. పూరిజిల్లాలో గ్రామీణ పేదల్లో పనిచేస్తూ అనేక రైతాంగ ఉద్యమాలను నిర్వహించారు. రెండుసార్లు పార్టీ తరపున ఎమ్మెల్యేగా పోటీచేసి స్వల్ప తేడాలతో ఓడిపోయారు. నిజాయితీకి, ముక్కుసూటితనానికి, నిరాడంబరతకు, క్రమశిక్షణకు, నమ్మిన సిద్ధాంతంపట్ల నిబద్ధతకు, కమ్యూనిజంపట్ల నిబద్ధతకు ఆయన నిదర్శనంగా వున్నారు. 1975లో సిపిఐ పార్టీ ఎమర్జెన్సీపై తీసుకున్న వైఖరితో ఆయన విభేదించారు. గోర్బచేవ్ లైన్‌ను వ్యతిరేకిస్తూ చివరకు 1989లో సిపిఐతో తెగతెంపులు చేసుకున్నారు. సిపిఐ(ఎం-ఎల్) పార్టీతో చర్చలు జరిపి, వారి ప్రజాయుద్ధ పంథాతో పూర్తిగా ఏకీభవించి అందులో చేరారు. కాలక్రమంలో ఒడిషా పార్టీలో ప్రధానంగా మారారు. తన సలహాలతో, సూచనలతో, చురుకుదనంతో, సహకారంతో యువకార్యకర్తలకు స్ఫూర్తిదాయకమైన పెద్ద కామ్రేడ్‌గా దృఢంగా నిలిచారు. ఒడిషాలోని వివిధ ప్రజాఉద్యమాలలో, పార్టీ అభివృద్ధిచెందటంలో ఆయన విలువైన భాగస్వామ్యం వున్నది. తుదిశ్వాస విడిచేవరకు ఆయన చురుకుగానే వున్నారు. ఆయన లేకపోవటం పార్టీకి పెద్ద లోటు. మన ప్రియతమ నాయకుడు కామ్రేడ్ బ్రహ్మానంద మాలిక్‌కు విప్లవజోహార్లు.

ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాము.

**జూన్, 7, 2019**

**కేంద్రకమిటి**
**సిపిఐ(ఎం-ఎల్)**